క్లుప్తంగా

మోడల్ స్కూల్‌కు సామగ్రి వితరణ



పాఠశాలకు సామగ్రిని వితరణ చేస్తున్న కేటీఆర్

జి.సిగడాం: స్థానిక ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్లో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న కోట తిరుపతిరావు రూ.20 వేలు విలువైన సామగ్రిని గురువారం ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్‌కు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డీహెచ్ సుబ్రహ్మణ్యం, సీహెచ్ రవికుమార్, పిచ్చిక నేతాజీ, టి.జగదీశ్వరరావు, ముత్యాలరావు, ఎ.నరసయ్య, బి.ఆది నారాయణ పాల్గొన్నారు.

పతివాడపాలెంలో కంటి వైద్యశిబిరం



కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

రణస్థలం: పతివాడపాలెంలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, డాక్టర్ రెడ్డీస్ నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 143 మంది కళ్లను పరీక్షించగా 47మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రోగాం కో ఆర్డినేటర్ రవితేజ, ఫీల్డ్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, మోహన్ రావు, నైస్ ఫౌండేషన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వసాహితీ కళావేదిక కన్వీనర్‌గా ఈవేమన



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం జెండాల వీధికి చెందిన కవి, రచయిత షేక్ మహ్మద్ రఫీ (ఈవేమన)ను విశ్వసాహితీ కళావేదిక కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ చైర్‌పర్సన్ కొల్లి రమావతి నియామకపత్రం పంపినట్లు ఈవేమన గురువారం తెలిపారు. మంచి సాహిత్యం, కళలు అందరికీ అందించాలనే ఉద్దేశంతో విశ్వసాహితీ కళావేదిక ఏర్పాటైందని చెప్పారు.

ముగిసిన బైబిల్ సెమినార్



సెమినార్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: క్రైస్ట్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ చార్చ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలోని రాయ్ బిల్డింగ్స్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న బైబిల్ సెమినార్ గురువారంతో ముగిసింది. బైబిల్ టీచర్ కొండవీటి బాబూరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణ దైవసేవకులు, సువార్తికులు దేవుని వాక్యం నేర్చుకున్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెవ.ఎన్ సురేష్ ఐజాక్, ఎస్.శ్యామ్‌కుమార్, రెవ.కె.డానియేలు తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల : మండలంలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వరదలు, తుఫాన్లు వంటి విపత్తుల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ కె.సత్యనారాయణ, డైరెక్టర్ బాలాజీ, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, క్యాంపస్-2 ఇన్‌చార్జి వి.సాగర్, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావు, పీఓలు బెందాళం శ్రీధర్, యోగా అధ్యాపకులు టి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



బూర్ల ప్రకాశరావు (ఫైల్)

ఎచ్చెర్ల : నవభారత్ జంక్షన్ కాలనీ వద్ద నివాసముంటున్న బూర్ల ప్రకాశరావు (87) కనిపించడం లేదని కుమారుడు వాసుదేవరావు ఎచ్చెర్ల పోలీసులకు గురువారం ఫిర్యాదుచేశారు. ప్రకాశరావు భార్య నెల రోజుల క్రిందట మృతి చెందింది. అప్పటి నుంచి మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ తరలిస్తే.. ఊరుకునేది లేదు!



బుడగట్లపాలెం సామాజిక భవనంలో ప్రస్తుతం కొనసాగుతున్న కేవీపేట బీసీ హాస్టల్

- రెండు ఊర్ల మధ్య వివాదంగా మారిన కేవీపేట బీసీ వసతి గృహం మార్పు
- తమ గ్రామంలోనే ఉంచాలంటున్న కొమరవానిపేట గ్రామస్తులు
- పాత భవనంలోనే కొనసాగించాలంటున్న బుడగట్లపాలెం గ్రామస్తులు
- వర్గపోరులో నలిగిపోతున్న విద్యార్థులు, వార్డెన్లు



ఇటీవల కొమరవానిపేట తుఫాన్ షెల్టర్‌లో పెట్టిన కేవీపేట బీసీ హాస్టల్

రణస్థలం: పెద్దల పంతం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. రణస్థలం మండలం కొచ్చెర్ల పంచాయతీ కొమరవానిపేట(కేవీపేట) ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం మార్పు రెండు గ్రామాల మధ్య సమస్యగా మారింది. కేవీపేటలో హాస్టల్ నిర్వహణకు పక్కా భవనం లేనందున అప్పట్లో కలెక్టర్ ఆదేశాలతో పక్కనే ఉన్న ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సామాజిక భవనంలో వసతి గృహం ప్రారంభించారు. అప్పటి నుంచి 15 ఏళ్లగా ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా నడుస్తోంది. ఇరుగ్రామాల సమ్మతితో బుడగట్లపాలెం, కొచ్చెర్లతో పాటు చుట్టుపక్కల పలు పంచాయతీలకు చెందిన సుమారు 90 మంది విద్యార్థులతో వసతి గృహం కొనసాగుతోంది.

తుఫాన్‌షెల్టర్‌కు మార్చడంతో..

బుడగట్లపాలెంలోని సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుందని కేవీపేటలో కొత్తగా కట్టిన తుఫాన్ భవనానికి మార్చాలని కోరుతూ ఈ ఏడాది జూలై 14న కలెక్టర్ గ్రీవెన్సులో కేవీపేట గ్రామస్తులు అర్జీ పెట్టుకున్నారు. జూలై 16న కొమరవానిపేట తుఫాన్ షెల్టర్‌లోకి మార్చుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో కేవీపేట బీసీ బాలుర వసతి గృహాన్ని ఆగస్టు 11న కొచ్చెర్ల పంచాయతీలోని కేవీపేట తుఫాన్ షెల్టర్‌లోకి మార్చుతూ ఆదేశాలు జారీ కావడంతో నిర్వాహకులు వంట సామగ్రి, ఇతర వస్తువులు తెచ్చేశారు. 15న కొచ్చెర్ల పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి చేతుల మీదుగా జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర్య వేడుకలు సైతం నిర్వహించారు.

రగడ రాజుకుంది ఇలా..

స్వాతంత్ర దినోత్సవం మరుసటి రోజు ఏం జరిగిందో గానీ పరిణామాలు చకచకా మారిపోయాయి. ఆగస్టు 16న పాత స్థలమైన బుడగట్లపాలెం పరిధిలోని సామాజిక భవనంలోనే హాస్టల్ కొనసాగించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ కావడంతో వంట పాత్రలు, ఇతర సామగ్రి పట్టుకుపోయారు. దీంతో కొచ్చెర్ల, బుడగట్లపాలెం సర్పంచ్‌లు తమ వర్గీయులతో కలెక్టర్ గ్రీవెన్సులో ఈ నెల 18న వేర్వేరుగా ఫిర్యాదు చేసుకున్నారు. జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయంలో ఎవరికి వారే వాదనలు వినిపించుకున్నారు. కేవీ తుఫాన్ షెల్టర్ భవనంలోని మార్పి మరలా వెనక్కి ఎందుకు మార్చారని కొచ్చెర్ల పంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు వాదిస్తుంటే.. బుడగట్లపాలెం సామాజిక భవనం బాగానే ఉందని, అలాంటప్పుడు ఎందుకు మార్చుతారని అక్కడి ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

తలపట్టుకుంటున్న వార్డెన్లు..

రెండు గ్రామాల ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు తట్టుకోలేక ఇన్‌చార్జి వార్డెన్‌గా ఉన్న జి.గుణవతి విధుల నుంచి తప్పుకుని తాను పూర్తి బాధ్యతలు నిర్వర్తిస్తున్న జీరుపాలెం వసతి గృహానికి వెళ్లిపోయారు. కేవీపేటకు మూగి నారాయణను తాత్కాలిక వార్డెన్‌గా నియమించారు. నారాయణ స్వగ్రామం కేవీపేట. దీంతో సమస్య మరింత జఠిలంగా మారే అవకాశ ముందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇరు గ్రామాల ప్రజాప్రతినిధుల మధ్య తాము నిలిగిపోవాల్సి వస్తోందని వార్డెన్లు చెబుతున్నారు. ఈ పరిణామాలతో విద్యార్థులు సైతం సక్రమంగా హాజరుకావడం లేదు.

సమస్య పరిష్కరిస్తాం..

కేవీపేట బీసీ బాలుర వసతి గృహం భవనం మార్పుపై బుడగట్లపాలెం, కొమరవానిపేట సర్పంచులు, గ్రామస్తులు ఎవరికి వారే అన్నట్లు ఫిర్యాదుల చేసుకుంటున్నారు. అందరూ కలిసి సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవాలని చెప్పినా వినడం లేదు. ఈ ఒత్తిడి వల్ల ఇన్‌చార్జి వార్డెన్ గుణవతి సొంత స్థానానికి వెళ్లిపోయారు. జరుగుతున్న పరిణామాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

– ఈ.అనూరాధ, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి

ప్రతిఒక్కరూ ధర్మబద్ధంగా నడవాలి



మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును సత్కరిస్తున్న చిద్రూపానంద సరస్వతి

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ ధర్మబద్ధంగా నడుచుకోవాలని ఢిల్లీ చిన్మయ మిషన్ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు స్వామి చిద్రూపానంద సరస్వతి అన్నారు. బాపూజీ కళామందిర్‌లో చిన్మయ మిషన్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో మహాభారతంలోని శాంతిపర్వంపై నాలుగో రోజు గురువారం ఉపన్యాసం జరిగింది. ఆపద్ధర్మ పర్వంలో విపత్తులు సంభవించినపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మూడు చేపల కథల ద్వారా వివరించారు. ముందుగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును స్వామీజీ దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో స్వామి పరాత్మానంద సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు అంధవరపు సూరిబాబు, నిక్కు అప్పన్న, నిష్టల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మేదరవీధిలో మున్సిపల్ సిబ్బంది హడావుడి



సామగ్రిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

శ్రీకాకుళం: నగరంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న మేదర వీధిలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది గురువారం హడావిడి చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంతో పాటు మరికొందరు మేదర వీధికి వచ్చి రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా అధికారులు రావడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా వినకుండా బుట్టలు తొలగించడంతో కొందరు వ్యాపారులు జోక్యం చేసుకొని ఎమ్మెల్యేకు సమాచారం అందించారు. ఆయన కమిషనర్కు ఫోన్ చేసి చర్యలు నిలుపుదల చేయాలని ఆదేశించడంతో అధికారులు వెనుదిరిగారు.

రైతులను ఆదుకుంటాం

శ్రీకాకుళం రూరల్: ప్రతి రైతునూ ఆదుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ భరోసా ఇచ్చారు. మామిడివలస తదితర ప్రాంతాల్లో ముంపునకు గురైన వరి పంట పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పారు. వంశధార, నాగావళి గట్టుల ఆక్రమణలపై చర్యలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

గోతులు తీశారు.. పూడ్చటం మరిచారు..

- ప్రహసనంగా పెదపాడు రోడ్డు విస్తరణ పనులు
- రెండు నెలలుగా రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు



రోడ్డును ఆనుకుని తవ్వేసిన గోతులు



చెక్కపలకలపై రాకపోకలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడు గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు ప్రహసనంగా మారాయి. పనులు పూర్తికాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత్యంతరం లేక గోతుల్లోనే దిగి రాకపోకలు సాగిస్తున్నారు. రెండు నెలల కిందట రోడ్డు విస్తరణలో భాగంగా గోతులు తవ్వారు. తర్వాత వాటిని అలాగే వదిలేయడంతో చిన్నారులు, వృద్ధులు గోతుల్లో పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన గోతులు పూడ్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షాల వల్లే..

పనుల్లో జాప్యంపై ఆర్‌అండ్‌బీ అధికారి రాజశేఖర్ వద్ద ప్రస్తావించగా ఇటీవల పడిన వర్షాల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని చెప్పారు. మున్సిపల్ వాటర్ పైపుల వల్ల కొంత సమయం పట్టిందన్నారు. ఈ నెలాఖరులోపు పనులు పూర్తిచేస్తామన్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



గోతులు తీసి రెండు నెలలు అవుతోంది. రోడ్డును ఆనుకొని ఇళ్లు ఉండటంతో గోతుల్లో దిగి రాకపోకలు సాగిస్తున్నాం. చిన్నారులు, వృద్ధులు గోతుల్లో పడి గాయపడుతున్నారు. ఇప్పటికై నా పనులు పూర్తి చేయాలి.

– రాముడు, పెదపాడు

పలకలే దిక్కు..



ఇంటికి, పాన్‌షాపులకు ఇంటి నుంచి రాకపోకలు సాగించాలంటే చెక్క పలకలే దిక్కు. ఒక్కోసారి గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలి.

– హరికృష్ణ, పెదపాడు

రణస్థలాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలి

రణస్థలం: కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపడితే రణస్థలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని సురాజ్య భారత్ కన్వీనర్ దుక్క ఆదినారాయణ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని మౌలిక సదుపాయాలున్న రణస్థలం మండలం మరింత అభివృద్ధి జరగాలంటే రెవెన్యూ డివిజన్‌గా మార్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

ప్లాట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు 90 రోజులు గడువు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర పాలక సంస్థ పరిధిలో అనధికార లే-ఔట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసిన వారు వాటిని క్రమబద్ధీకరణ చేసుకునేందుకు 90 రోజుల్లోగా ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలిక, పట్టణాభివృద్ధి శాఖ జీవో 134 ద్వారా అనధికార లేఔట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణ నిబంధనలు 2020ను సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీని ప్రకారం నగరపాలక సంస్థ పరిధిలో జూన్ 30కు ముందు ఎవరైనా అనధికార లే-ఔట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేస్తే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏసీపీలు వెంకటేశ్వరరావు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

శ్రీకాకుళం క్రైమ్/జి.సిగడాం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని ఉమెన్స్ కళాశాల వద్ద పోలీసులు వాహన తనిఖీల ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఒకటో పట్టణ ఎస్ఐ-2 రామారావు ఆధ్వర్యంలో వాహన పత్రాలు పరిశీలించారు. జి.సిగడాం మండలంలోని సర్వేశ్వరపురం కూడలి వద్ద ఎస్ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అంకితభావంతో పనిచేయాలి

శ్రీకాకుళం రూరల్: సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేయాలని శ్రీకాకుళం తహశీల్దార్ ఎం.గణపతిరావు సిబ్బందికి సూచించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో పరిపాలన విధానంపై వీఆర్వోలు, సిబ్బందితో సమావేశమయ్యారు. డీటీ చక్రవర్తి, ఎలక్షన్ డీఈ శ్రీనివాస్, ఆర్ఐలు పాల్గొన్నారు.

25న చలో కలెక్టరేట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న చేపట్టనున్న చలో కలెక్టరేట్‌లో విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఆర్ట్స్ కాలేజీలో పోస్టర్ ఆవిష్కరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3వేలకు పెంచాలని, హాస్టల్స్‌కు సొంత భవనాలు కేటాయించాలని, జీవో 77 రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని కోరారు. విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జైరామ్, ఎం.శివ, డి.చిన్న, మండల కమిటీ సభ్యులు ఆదిత్య, చాందిని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, 5జీ ట్యాబ్‌లు ఇవ్వాలని సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్-హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 రోజులు చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, అయినా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం తగదన్నారు. తమకూ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఆన్‌లైన్ వర్క్‌కు ఒక యాప్ మాత్రమే ఉండాలన్నారు.

అనంతరం తహశీల్దార్ ఎస్.గణపతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధి టి.రాజేశ్వరి, సెక్టార్ లీడర్లు కె.జ్యోతి, జి.రాజేశ్వరి, డి.ఇందుమతి, అంజలీబాయ్, పద్మజ, ముత్యాలమ్మ, బుడ్డమ్మ, పి.సుశీల, లక్ష్మి, రమణమ్మ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువ క్రికెటర్లను ప్రోత్సహిస్తాం



నెట్స్‌లో పిచ్‌ను పరిశీలిస్తున్న రవిశంకర్ చలం తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ యువ, ఫ్యూచర్ క్రికెటర్లను గుర్తించేందుకు సన్నాహాలు చేస్తోందని ఏసీఏ టాలెంట్ కమిటీ హెడ్ రవిశంకర్ చలం అన్నారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన జిల్లా క్రికెట్ సంఘం(జెడీసీఎస్) కార్యదర్శి హసన్‌రాజా షేక్, కోచ్‌లతో కలిసి క్రీడాకారుల ఫలితాలపై సమీక్షించారు.నిరంతర సాధన, టెక్నిక్స్‌తో మంచి ఫలితాలు సాధించవచ్చని.. ఆ దిశగా కోచ్‌లు తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా క్రికెట్ సంఘ మెంటార్ ఇలియాస్ అహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, కౌన్సెల్ సభ్యులు డాక్టర్ ఎస్.రవికుమార్, చీఫ్ కోచ్ కె.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇచ్ఛాపురం సబ్‌సెంటర్‌ను జెడీసీఎస్ ప్రతినిధులతో కలిసి రవిచలం సందర్శించారు. మైదానం చాలా బావుందని.. మరింతగా తీర్చిదిద్దితే స్థానికంగా క్రీడాకారులకు ఎంతగానో ఉపయుక్తమౌతుందని పేర్కొన్నారు. అందుకుగాను మూడు టర్ఫ్ వికెట్లను కేటాయింపు చేసేలా ఏసీఏకు ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారని.. వారిని మరింతగా ప్రోత్సహించినట్లయితే రంజీ, తర్వాత ఐపీఎల్ ఎంపికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈయన వెంట సంఘ జాయింట్ సెక్రటరీ బెనర్జీ, కార్యవర్గ సభ్యులు అలీమ్‌ఖాన్, కోచ్ గోపి, దాసరి రాజు, సీనియర్ క్రికెటర్లు ఉన్నారు.

దివ్యాంగులకు తప్పని పాట్లు



రణస్థలం మండల కేంద్రానికి వస్తున్న కురిమిన తవిటయ్య

రణస్థలం: మండలంలో దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం కోత విధిస్తోంది. వికలాంగత్వం 40శాతం కంటే తక్కువ ఉందని చూపించి నోటీసులు ఇస్తున్నారు. దీంతో మంచాలపై కదలేని స్థితిలో ఉన్న దివ్యాంగ వృద్ధులను సంరక్షకులు మండల కార్యాలయాలకు తీసుకొస్తున్నారు. ఒక్క రణస్థలం మండలంలోనే 124 మందికి పైగా దివ్యాంగ పింఛన్లు తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని, సదరం స్లాట్ బుక్ చేసి, వైద్యుల వద్దకు వెళ్లి వికలాంగత్వం 40శాతం కంటే అధికంగా ఉందని నిరూపించుకుంటేనే పింఛన్ పునరుద్ధరణ అవుతుందని అధికారులు చెప్పడంతో గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్దకు దివ్యాంగులు తరలివచ్చారు. దుంప జోగులు పుట్టుకతోనే దివ్యాంగుడు. ఎప్పటి నుంచో వస్తున్న పింఛన్‌ను వచ్చే నెల నుంచి నిలిపివేస్తున్నామని నోటీస్ ఇచ్చారని బాధితుడు లబోదిబోమంటున్నాడు. నారువ గ్రామానికి చెందిన వృద్ధుడు కురిమిన తవిటయ్య(68)కు రెండు కళ్లు కనిపించవు. గతంలో ఉన్న 100శాతం వికలాంగత్వం ప్రస్తుతం 40 శాతం లోపు ఉందని పింఛన్ తీసేశారు. దీంతో కుటుంబ సభ్యులు తవిటయ్యను ఆటోలో రణస్థలం ఎంపీడీఓ కార్యాలయం వద్దకు పట్టుకుని వచ్చారు.

పాఠశాల అభివృద్ధికి సాయం



ట్యాప్‌లను ప్రారంభిస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ ఎర్రయ్య, ప్రిన్సిపాల్ అనురాధ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ మండలంలోని శాస్త్రులపేట వద్ద ఉన్న మహాత్మాజ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు తమవంతు సహకారం అందిస్తున్నారని ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు.పాఠశాలకు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ చైర్మన్ పిన్నింటి ఎర్రయ్య కలిసి రూ.15 వేల విలువైన 125 కుళాయి ట్యాప్‌లు అందజేశారు. డైనింగ్ హాల్, డార్మెటరీ, మరుగుదొడ్లు, ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఈట్యాప్‌లను ఎస్ఎంసీ చైర్మన్, ప్రిన్సిపాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది సీసీ కెమెరాలు, కంప్యూటర్ ల్యాబ్ కోసం 50 కుర్చీలు, ఎల్ఈడీ బల్బులు, ఫ్యాన్‌లు, టేబుళ్లు అందించామని తెలిపారు. దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు బాసి నాగరాజు, నిమ్మ తవిటిరెడ్డి, బూర్ల నారాయణరావు, పి.కృష్ణమూర్తి, జగ్గరోతు శిమ్మినాయుడు, ముంత త్రినాధరావు, రౌతు లక్ష్మణ, తదితరులు అందించిన ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేక మహోత్సవం



శిఖరానికి అభిషేకాలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివబాలాజీ ఆలయంలో గురువారం మహా కుంభాభిషేక మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి, ఉమా సమేత అమరనాథేశ్వరుల శిఖరాలకు సహస్ర కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. పండితులు అంపోలు రుద్రకోటేశ్వరశర్మ, భాస్కరభట్ల శ్రీరామశర్మ, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు వచ్చి ఆలయ శిఖరాలకు అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు గోపినంబాళ్ల వేంకట సీతారామాచార్యులు, నేతేటి మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో సాయంత్రం కల్యాణ వేంకటేశ్వరునికి, అమరాధేశ్వరులకు శాంతి కల్యాణం నిర్వహించి పండిత సత్కారం చేశారు. అన్నప్రసాద వితరణ కూడా జరిగింది. కార్యక్రమంలో రుత్విక్కులు చామర్తి జగన్నాధాచార్యులు, భోగారపు వెంకట రమణాచార్యులు, స్మార్తాగమ పండితులు శృంగారం లక్ష్మీధనుంజయశర్మ, ఆలయ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుంట తులసీరావు, మహేష్ చంద్ర సామంత్, కోశాధికారి ఆర్‌వీఎస్ శర్మ, కె.రమేష్ కుమార్, ముద్దాడ రామకృష్ణ, ఎస్.రాంబాబు రెడ్డి కరకవలస ప్రసాదరావు, ఆర్.వైకుంఠరావు, ఎస్.కైలాసరావు, కె.సత్యన్నారాయణ, ఎ.పట్టాభిరామారావు, కొనపాల ప్రసాదరావు, సిహెచ్.దుర్గారావు, కె.త్రినాధరావు, ఎస్.కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.